పేరు గొప్ప.. ఊరు దిబ్బ...

అన్న సామెత అచ్చంగా దువ్వాడ రైల్వేస్టేషన్‌కు సరిపోతుంది. అమృత భారత్ కార్యక్రమంలో దువ్వాడ రైల్వేస్టేషన్ రూపురేఖలు మారుస్తామని చేస్తున్న ఆర్భాటానికి.. క్షేత్ర స్థాయిలో పరిస్థితికి పొంతన కుదరడం లేదు. ఆదాయ సముపార్జనలో వాల్తేరు డివిజన్‌లో ఐదో స్థానం, వాల్తేరు, ఖుర్దా రోడ్డు డివిజన్ల పరిధిలో అత్యధిక ఆదాయం తీసుకు వస్తున్న దువ్వాడ రైల్వేస్టేషన్‌లో సమస్యలు **కూత పెడుతున్నాయి.**



చుక్..చుక్.. సమస్యల కూత

- మూలకు చేరిన బెంచీలు
- అలంకారప్రాయంగా కూలర్
- మరుగుదొడ్లకు తాళాలు
- దువ్వాడ రైల్వేస్టేషన్‌లో వసతుల లేమిపై ప్రయాణికుల అసహనం



దువ్వాడ రైల్వేస్టేషన్

అగనంపూడి: విశాఖ మీదుగా ఏ ప్రత్యేక రైలు నడపాలన్నా.. కేరాఫ్ దువ్వాడ. అంతటి ప్రాచుర్యం ఉన్న ఈ రైల్వేస్టేషన్‌లో సౌకర్యాలు మాత్రం తీసికట్టుగా ఉన్నాయి. పదేళ్ల కిందట ఆదర్శ రైల్వేస్టేషన్ కార్యక్రమంలో భాగంగా నాలుగో ప్లాట్‌ఫారం విస్తరించి మమా అనిపించారు. ఆ తర్వాత నుంచి ప్రయాణికుల అవసరాల మేరకు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు ఉదాసీన వైఖరితో వ్యవహరిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. దువ్వాడ రైల్వే స్టేషన్ ద్వారా ప్రయాణం సాగించే ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగారు. ఆదాయం రెట్టింపు అయినా కనీస సౌకర్యాలు కల్పనకు అధికారులు శ్రద్ధ తీసుకోవడం లేదని ప్రయాణికులు మండిపడుతున్నారు.



ఒకటో ప్లాట్‌ఫారం పైనుంచి పారుతున్న నీరు



మూసివేసిన పే అండ్ యూజ్ మరుగుదొడ్లు

అధికారుల నిర్లక్ష్యం... ప్రయాణికులకు శాపం

- అధికారుల నిర్లక్ష్యం ప్రయాణికులకు శాపంగా మారింది. ఆరేళ్ల కిందట ఎంపీ నిధులతో ప్లాట్‌ఫారం-1,4లపై ఏర్పాటు చేసిన స్టీల్ బెంచీలు సగానికి పైగా మూలకు చేరాయి. చిన్నపాటి మరమ్మతులతో వీటిని వినియోగంలోకి తీసుకురావచ్చు. అయినా వీటి గురించి పట్టించుకునే పరిస్థితి లేదు.
- నాలుగో నంబర్ ప్లాట్‌ఫారంపై ఉన్న మంచినీటి కూలర్లు మరమ్మతులకు గురయ్యాయి.
- ఒకటో నంబరు ప్లాట్‌ఫారంను ఆనుకుని ఏర్పాటు చేసిన మరుగుదొడ్లకు తాళాలు వేశారు.
- ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపై గతంలో ఉన్న టీస్టాల్స్ (క్యాంటీన్ సౌకర్యం) మూసివేసేశారు. కొద్ది నెలల నుంచి వీటిని తెరవకపోవడంతో కాఫీ, టీ, అల్పాహారం కోసం ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.
- ఏడాది కిందట ఏర్పాటు చేసిన రైల్వే టైమ్‌టేబుల్ మార్చకపోవడంతో ప్రయాణికులు తికమకకు గురవుతున్నారు. మారిన రైళ్ల రాకపోకల వివరాలు, రైళ్ల నంబర్లు, కొత్త రూట్‌లో రైళ్ల వివరాలతో కూడిన టైమ్ టేబుల్ ఏర్పాటు చేయాలనే ఆలోచన చేయడం లేదు.
- ప్లాట్‌ఫారాలపై ఉన్న మంచినీటి కుళాయిల చుట్టూ చెత్తా, చెదారం, మురుగుచేరి పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. పలు ట్యాప్‌ల నుంచి నీరు వృథాగా ప్లాట్‌ఫారంపై పారుతోంది.
- స్టేషన్‌కు రెండు వైపులా పార్కింగ్ ఫీజులు వసూలు చేస్తున్నా కనీసం ద్విచక్రవాహనాలకు షెల్టర్లు నిర్మించాలన్న ఆలోచన చేయకపోవడంతో వాహనాలు ఎండకు ఎండి, వానకు తడుస్తున్నాయి.
- రెండు ప్రవేశ మార్గాల వద్ద, టికెట్ బుకింగ్ కౌంటర్లు, ఆరుబయట కనపడేలా సీసీ కెమెరాలు అమర్చలేదు. ఫలితంగా నేరగాళ్ల కదలికలు, గంజాయి రవాణా, ఇతర అక్రమ రవాణాకు చెక్ చెప్పడానికి అవకాశం లేకుండా పోయిందని ప్రయాణికులు వాపోతున్నారు.



మూలకు చేరిన ఐరన్ బల్లలు



ఎండైనా.. వానైనా బయటే వాహనాలు

మరమ్మతులకు దిక్కులేదా?



లక్షల విలువైన స్టీల్‌బెంచీలకు చిన్నపాటి మరమ్మతులు చేపడితే వినియోగంలోకి వస్తాయి. అలాగే ప్లాట్‌ఫారంపై మంచినీటి కూలర్‌ను నిరుపయోగంగా వదిలేశారు. వేలల్లో ఖర్చుచేస్తే ఉపయోగపడే వాటిని తుక్కుగా పరిగణించి వదిలేయడం ఎంతవరకు సమంజసం. అధికారులు స్పందించి సౌకర్యాలు మెరుగుపర్చాలి.

– రాపర్తి రవి, మంగళపాలెం

వసతుల కల్పనలో నిర్లక్ష్యం



కనీస వసతులు కల్పించడంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనపడుతోంది. యూజ్ అండ్ పే మరుగుదొడ్లకు తాళాలు వేసి ఉంచారు. ద్విచక్రవాహనాలకు కనీసం షెడ్లు కూడా నిర్మించకుండా పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నారు. అధికారులు ఈ విషయంలో తగు చర్యలు తీసుకోవాలి.

– సంద్రాన రామకృష్ణ, రాజీవ్‌నగర్



మరమ్మతులకు గురైన మంచినీటి కూలర్

క్లుప్తంగా

ఉచిత శిక్షణ.. ఉద్యోగ అవకాశాలు

అక్కిరెడ్డిపాలెం: హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, బొల్లినేని మెడ్ స్కిల్స్ సంయుక్తంగా బ్యూటీషియన్, హోటల్ మేనేజ్‌మెంట్, జనరల్ డ్యూటీ మేనేజ్‌మెంట్ (నర్సింగ్), ప్రొడక్షన్ మెషీన్ ఆపరేటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు షీలానగర్‌లోని బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు శనివారం తెలిపారు. ఈ కోర్సులు విశాఖపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని సెకండ్ ఫ్లోర్‌లో గల స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. కోర్సుల్లో చేరేందుకు ఇంటర్, డిప్లమో, ఐటీఐ, పదో తరగతి పూర్తి చేసి 18 నుంచి 28 ఏళ్ల లోపు విద్యార్థినీ, విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. మూడు నెలల పాటు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ఉచిత శిక్షణతో పాటు యూనిఫాం, బుక్స్, ఏసీ క్యాంపస్ వంటి సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు వివరాలకు 7993011695, 9121999654 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

164 మందికి నేత్ర వైద్య పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య నిపుణులు

పెదగంట్యాడ: అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో శనివారం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరాన్ని 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, అదానీ గంగవరం పోర్టు కార్పొరేట్ అఫైర్స్ హెడ్ బాపూజీ ప్రారంభించారు. నేత్ర వైద్య నిపుణులు 164 మందికి నేత్ర పరీక్షలు చేశారు. 78 మందికి కళ్లద్దాలు అవసరమని, మరో 15 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు, ఆరుగురికి హయ్యర్ మెడికల్ చికిత్సలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో సీఎస్సార్ మేనేజర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

అగనంపూడి విద్యార్థులకు అభినందన



బహుమతి అందుకుంటున్న అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

అగనంపూడి: స్థిరమైన వ్యర్థాల నిర్వాహణ సదస్సులో అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రదర్శనకు తృతీయ బహుమతి లభించింది. గతనెల 27న గీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఐపీఎల్ఏ గ్లోబల్ ఫోరంలో పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు మోడల్‌మేకింగ్, డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సీనియర్ విభాగంలో వ్యర్థాలు, ఆహారం పునర్వినియోగం అనే అంశంపై అగనంపూడి విద్యార్థులు ఏర్పాటు చేసిన మోడల్ మేకింగ్ ప్రదర్శనకు తృతీయ బహుమతి లభించింది. కార్యక్రమంలో పాల్గొన్న నార్వే, ఈజిప్ట్, హంగేరీ దేశాల ప్రతినిధులు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం హెచ్‌ఎం కృష్ణారావు ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులతో గైడ్ ఉపాధ్యాయులుగా వ్యవహరించిన కృష్ణవేణి, టి.జి.రవికుమార్‌లను అభినందించారు.

ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన

గాజువాక: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎయిడ్స్ డేను పురస్కరించుకొని శనివారం కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ ప్రసంగించారు. ఎయిడ్స్ రక్త మార్పిడివల్ల, ఒకరికి వాడిన బ్లేడ్ మరొకరికి ఉపయోగించడంవల్ల సంక్రమించే అవకాశం ఉందన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డి.వి.తేజశ్వరరావు, ఎస్.వి.కృష్ణ, ఎస్.కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పుస్తెలతాడు చోరీ చేసిన యువకుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న క్రైం ఏడీసీపీ మోహనరావు

పెదగంట్యాడ: వృద్ధురాలి మెడలో పుస్తెలతాడు చోరీ చేసిన నిందితుడిని న్యూపోర్టు పోలీసులు అరెస్టు చేశారు. న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రైం ఏడీసీపీ ఎస్.మోహనరావు వివరాలు వెల్లడించారు. విజయనగరం జిల్లా వేపాడ మండలానికి చెందిన వబ్బిన కోటరావు అలియాస్ కోటి (24) తల్లిదండ్రులతో కలసి గాజువాకలో నివాసం ఉంటున్నాడు. చెడు వ్యసనాలు, బెట్టింగ్‌లకు అలవాటు పడిన అతను అప్పులు చేశాడని వివరించారు. అప్పులు ఎక్కువ కావడంతో సులభంగా డబ్బు సంపాదించాలని దొంగతనాలకు దిగాడని చెప్పారు. ఇందులో భాగంగా ఒంటరిగా ఉంటున్న మహిళలను లక్ష్యంగా చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని వికాస్‌నగర్‌లో వుడా ఎంఐజీలోని ఫస్ట్ ఫ్లోర్‌లో శెట్టి రమాభాయి (75) అనే మహిళ ఒంటరిగా ఉండడాన్ని గుర్తించాడు. ఈ నెల 24న ఆమె ఇంట్లోని వంటగదిలో ఉన్న సమయంలో అతను వెనుక నుంచి వెళ్లి ఆమెను పట్టుకొని మెడలోని రెండు తులాల పుస్తెలతాడు తెంచేశాడన్నారు. ఆ సమయంలో జరిగిన పెనుగులాటలో ఆమె చేతి వేలికి గాయమైందన్నారు. దీనిపై ఫిర్యాదు అందుకున్న న్యూపోర్టు క్రైం సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ అప్పలరాజు బృందంతో కలసి సీసీ టీవీ పుటేజీలను సేకరించారని చెప్పారు. నిందితుడిని గుర్తించి శ్రామిక నగర్‌లో అదుపులోకి తీసుకుని విచారించామని తెలిపారు. పుస్తెలతాడును నగరంలోని రామాటాకీస్ సమీపంలోని ఓ గోల్డ్ ఫైనాన్స్ సంస్థకు విక్రయించాడని, దీంతో తాము ఆ పుస్తెలతాడుతో పాటు అతని వద్ద నుంచి రూ.64,900 రికవరీ చేశామన్నారు. అలాగే అతను వినియోగించిన స్కూటీని కూడా చోరీ చేసినట్టు గుర్తించామన్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కేసును ఛేదించిన పోలీస్ సిబ్బంది రామ్మూర్తి, ఎంవీ రమణ, రాజేష్, జయేంద్ర, రాజు, లక్ష్మణ్, సీహెచ్ గణపతి, నరేష్‌ను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో మృతుడి వివరాల లభ్యం

అక్కిరెడ్డిపాలెం: పాతగాజువాక పల్లావారి పెట్రోల్ బంక్ ఎదురుగా శుక్రవారం రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైన వ్యక్తి వడ్లపూడి, ఎరుకుల వీధికి చెందిన శీర అప్పల నాయుడు (30)గా పోలీసులు గుర్తించారు. గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాలు. అప్పల నాయుడు పరవాడలోని ఓ ల్యాబ్స్‌లో 8 ఏళ్లుగా పనిచేస్తున్నట్టు తెలిపారు. మృతునికి భార్య, కుమార్తెలు భారతి (6), వర్షిత (4) ఉన్నారన్నారు. శుక్రవారం రాత్రి పాతగాజువాక నుంచి వడ్లపూడిలోని తన నివాసానికి ద్విచక్రవాహనంపై వస్తున్న క్రమంలో లారీ వేగంగా వెళ్తూ ద్విచక్రవాహనానికి తగలించడంతో అప్పలనాయుడు ద్విచక్రవాహనంపై నుంచి అదుపుతప్పి పడిపోవడంతో లారీ అతనిపై నుంచి వెళ్లిపోయింది. దీంతో అప్పల నాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు తిరుపతిరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్టు సీఐ కోటేశ్వరరావు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి పెంపునకు కృషి



సీజీఎం శ్రీధర్‌ను సత్కరిస్తున్న ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి పెంచడానికి ఉద్యోగులందరూ కృషి చేయాలని స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) యు. శ్రీధర్ కోరారు. శనివారం ఆయన పదవీ విరమణ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి పెరుగుతుందన్నారు. మరింత ఉత్పత్తి సాధిస్తే ప్లాంట్ మనుగడ ఉజ్వలంగా ఉంటుందన్నారు. తన విధి నిర్వహణలో సహకరించిన ఉద్యోగులు, కార్మిక సంఘాలు, అసోసియేషన్లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి బయ్యే మల్లయ్య, లైజన్ ఆఫీసర్ నల్లి సుందరం, నాయకులు ఎస్. సత్యనారాయణ, ఎల్.వి. రమణారావు, సాయి ప్రసాద్, డి. పుల్లారావు, ఎస్. మోహన్‌బాబు, బీఎంకే రెడ్డి, కె. శ్రీనివాస్, ఎం.వి. రావు తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో...

స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధానకార్యదర్శి మంత్రి రాజశేఖర్ ఆధ్వర్యంలో నాయకులు సీజీఎం (వర్క్స్) శ్రీధర్‌ను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు మద్ది అప్పలరాజురెడ్డి, మొల్లి ఈశ్వరరావు, గొందేశి ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు రిటైర్డ్ అధికారికి ఘన సన్మానం



పదవీ విరమణ కార్యక్రమంలో పార్వతీపురం కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పీపీఎం విభాగం అసిస్టెంట్ మేనేజర్ బి.షణ్ముఖ శ్రీనివాసరావు పదవీ విరమణ సభను శనివారం ఘనంగా నిర్వహించారు. షణ్ముఖ శ్రీనివాసరావు అల్లుడైన పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఈడీ బిల్డింగ్‌లోని మోడల్ రూమ్, అవార్డు గ్యాలరీలను సందర్శించారు. పీపీఎం అధికారులు ఆయనకు స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి ప్రక్రియను ఆయనకు వివరించారు.

హోరు గాలి.. జోరు వాన



వర్షపునీటితో నిండిపోయిన వుడా కాలనీ ప్రధాన రహదారి

పెదగంట్యాడ: చలిగాలి వణికించింది..జోరు వాన ప్రజలను ఇంటికే పరిమితం చేసింది. ఫెంగల్ తుపాను కారణంగా శనివారం ఉదయం నుంచి కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించిపోయింది. రహదారులు జలమయమయ్యాయి. నడుపూరు, గోపాల్‌రెడ్డినగర్, గాంధీనగర్, స్వతంత్రనగర్, బర్మా కాలనీ, డెయిరీ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, రామచంద్రనగర్, బాబూ జగ్జీవన్‌రామ్ కాలనీ, రిక్షా కాలనీల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో నీరు రోడ్ల పైకి వచ్చింది. దీంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.

నిలిచిన వర్షపునీరు

అక్కిరెడ్డిపాలెం: తుపాను ప్రభావంతో కురిసిన వర్షానికి పలుచోట్ల రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనచోదకుల ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



చెరువును తలపిస్తున్న 65వ వార్డు చాకలి గెడ్డ వంతెన రహదారి

వర్షానికి ఈదురుగాలులు తోడవ్వడంతో వృద్ధులు, చిన్నపిల్లలు వణికిపోయారు. శుక్రవారం అర్ధరాత్రి మోస్తారు వర్షం అడపాదడపా కురుస్తూనే ఉంది. పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

రెండో వివాహానికి బ్రేక్

విశాఖ లీగల్: మొదటి భార్యతో విడాకులు తీసుకోకుండా రెండో వివాహానికి సిద్ధమైన వ్యక్తికి న్యాయస్థానం షాక్ ఇచ్చింది. ఈనెల 5వ తేదీన జరగాల్సిన వివాహానికి తాత్కాలికంగా బ్రేక్ వేసింది. ఈనెల 3వ తేదీన న్యాయస్థానం ఎదుట హాజరుకావాలని ఆదేశాలు జారీ చేసింది. గాజువాక చినగంట్యాడ దిబ్బవానిపాలేనికి చెందిన కంటుముచ్చు పావని అదే ప్రాంతానికి చెందిన కదిరి సతీష్‌కుమార్ మేనత్త మేనమామ పిల్లలు. ఈ నేపథ్యంలో ఇద్దరు వివాహం చేసుకోవాలని నిర్ణయించారు. పెళ్లికి పెద్దలు అంగీకరించకపోవడంతో గత ఏడాది జనవరి 20న సింహాచలంలో వివాహం చేసుకున్నారు. పావని కనిపించకపోవడంతో ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇద్దరు ఇష్టపడి వివాహం చేసుకున్నామని పోలీసులకు చెప్పగా ఇరు పక్షాలను రాజీ చేసి పంపించేశారు. రాజీ ప్రకారం మంచి ముహూర్తంలో పావనిని తీసుకొని వెళ్తామని అంగీకరించిన సతీష్‌కుమార్, కుటుంబ సభ్యులు కట్నం, కానుకల కోసం గొడవ పెట్టి ఆమెను పుట్టింట్లోనే వదిలేశారు. పోలీసు కేసుకు భయపడి తన భార్యను కాపురానికి పంపాలని సతీష్‌కుమార్ 2023లోనే అదనపు కుటుంబ న్యాయస్థానంలో కేసు దాఖలు చేశారు. విచారణలో ఉండగా, తామిద్దరం కేసు రాజీ చేసుకున్నామని సతీష్‌కుమార్ కేసు ఉపసంహరించుకున్నారు. ఇది ఇలా ఉండగా సతీష్ కుమార్ అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం వాడ నరసాపురం గ్రామానికి చెందిన గనగళ్ల రాజేశ్వరితో వివాహం కుదుర్చుకున్నారు. నవంబర్ 16న ప్రధానం చేసుకున్నారు. ఈనెల 5న పెళ్లి జరిపేందుకు ముహూర్తం పెట్టారు. విషయం తెలుసుకున్న బాధితురాలు కుటుంబ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. వాదనలు విన్న ప్రధాన కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి రాధారత్నం వివాహాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తూ, సతీష్ కుమార్, రాజేశ్వరిలు ఈనెల 3న కుటుంబ న్యాయస్థానానికి హాజరుకావాలని నోటీసు జారీ చేశారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ



స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ సెక్టార్-1 కొండపై వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం రాత్రి సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. కార్తీక అమావాస్య సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శంఖు, చక్ర, నామం రూపంలో దీపాలు వెలిగించారు. భక్తులు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

– ఉక్కునగరం



భారీ అన్నసమారాధనలు

అక్కిరెడ్డిపాలెం/పెదగంట్యాడ: జీవీఎంసీ 69వ వార్డు కాపుతుంగ్లాం ఉమారామలింగేశ్వరాలయం వద్ద, 65వ వార్డు వాంబే కాలనీలోని వైకుంఠ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం పెద్ద ఎత్తున అన్న సమారాధనలు నిర్వహించారు. కార్యక్రమాల్లో కరణం ముత్యాలనాయుడు, దొడ్డి రమణ, మంజుల పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంపై దృష్టి



కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

అగనంపూడి: దీర్ఘ కాలిక సమస్యలు సత్వరం పరిష్కరించేందుకు ప్రణాళిక రూపొందించాలని జోనల్ అధికారులను జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ ఆదేశించారు. జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ శనివారం 87వ వార్డు సిద్ధార్థనగర్‌లో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతో కలిసి పర్యటించారు. సిద్ధార్థ నగర్‌ను ఆనుకొని ఉన్న నాలుగున్నర ఎకరాల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించాలనే ప్రతిపాదన అపరిష్కృతంగా ఉండిపోయిందని, తిరుమల నగర్ నుంచి జాతీయ రహదారి వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని, కణితి కూడలి నుంచి జాతీయ రహదారి వరకు ప్రధాన డ్రైనేజీలను విస్తరించి ఆధునికీకరించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో నాయకులు విజయరామరాజు, డీవీఅప్పారావు, వర్రె రాంబాబు, ప్రగడ దానయ్య, మాటూరి రాము తదితరులు పాల్గొన్నారు.

బస్టాప్‌లో చెత్తా చెదారం తొలగింపు



బస్టాప్ వద్ద చెత్తాచెదారం,పిచ్చిమొక్కలను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

అగనంపూడి: నిరుపయోగంగా మారిన అగనంపూడి సెక్టార్-1 బస్టాప్‌ను వినియోగంలోకి తీసుకువచ్చారు. రెండు దశాబ్దాల కిందట బస్ షెల్టర్ నిర్మించారు. అప్పటి నుంచి బస్టాప్‌ను వినియోగించకపోవడంతో నిరుపయోగంగా మారింది. దీంతో షెల్టర్ ముందు భాగం పిచ్చిమొక్కలు, తుప్పలతో నిండిపోయింది. దీంతో ప్రయాణికులు రోడ్డు మీదే వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో శనివారం జీవీఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది పిచ్చిమొక్కలు చెత్తాచెదాం తొలగించి బస్టాప్ కూడలిని శుభ్రం చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.సీతారామయ్య, నాయకులు బి.సత్యనారాయణ, పెంటయ్య, సత్యారావు, రమేష్ పాల్గొన్నారు.